కథానిక    తుమ్మలపల్లి కవిత

# 'హంస లేచిపోయింది'

అందర్ని నవ్విస్తూ, కవ్విస్తూ తిరిగే శ్రీధర్‌ని ప్రతి ఒక్కరు ఇష్టపడతారు. జాతీయం చేయబడిన బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తూ, బ్యాంకుల జాతీయాన్ని వ్యతిరేకించేవాడు మా శ్రీధర్.

అమ్మాయిలతో స్వేచ్ఛగా మాట్లాడ్తూనే, స్త్రీ స్వాతంత్ర్యాన్ని వెక్కిరించే తిక్కమనిషి శ్రీధర్. అందుకే అతనికి మా అమ్మాయిలంతా చేరి తిక్కధరం అని పేరు పెట్టాము.

మా యువజన సంఘం ఏర్పాటుచేసిన కవితా గోష్ఠి ముగియగానే, ఆ రోజు శ్రీధర్ త్వరత్వరగా మా దగ్గరికి వచ్చాడు.

'రేపు మీరు నల్గురు మా ఇంటికి రావాలి' అంటూ అడ్రెస్ యిచ్చాడు.

'ఎందుకు?' అని కుతూహలంతో మేమడిగిన ప్రశ్నకు సమాధానంగా 'తర్వాత చెప్తానుగా' అంటూ వెళ్ళిపోయాడు.

'అందుకే నిన్ను మేము తిక్కధరం అనేది' అంది లత.

మరుసటి రోజు సాయంత్రం మేము నల్గురం అడ్రెస్ సరిచూసుకొని, అడయార్‌లో వున్న శ్రీధర్ ఇంటికి వెళ్ళాము. 'నా అహ్వానాన్ని మన్నించి వచ్చినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు' అంటూ ఎదురు వచ్చాడు,

'ఇంతకు మా నల్గుర్నీ ఎందుకు పిల్చావో చెప్పలేదు' అంది పద్మ.

'మా చెల్లెళ్ళు ఎప్పటినుండో మిమ్మల్ని పరిచయం చేయమని అడుగుతున్నారు. అంతే కాక మా చిన్న చెల్లెలి రిజల్ట్సు వచ్చాయి. అందుకే ఈ ఏర్పాటు' అన్నాడు నవ్వుతూ

'మా పెద్ద చెల్లెలు మధురం. బి. ఏ. పోయిన సంవత్సరం పూర్తిచేసింది. ఇహ పోతే, ఈమె మా చిన్నారి చెల్లెలు హంస. బి. ఎస్సి. ఈ సంవత్సరమే పాసయ్యింది.' అంటూ పరిచయాలు ముగించాడు.

మధురం గంభీరంగా ఉన్నా హంస దాదాపు శ్రీధర్‌లాంటిది. అల్లరిగా, అందర్ని అలరిస్తూ తిరుగుతున్న హంసని మేము నల్గురం ఇష్టపడ్డాము.

మధురంతో మాట్లాడుతున్న చిత్ర 'మీరెందుకు ఉద్యోగం చేయడం లేదు, అనగానే శ్రీధర్ 'మా ఇంట్లో ఎవరు ఇష్టపడం, ముఖ్యంగా నాకిష్టం లేదు. ఆడపిల్లలు ఉద్యోగాలు చేస్తే ఇంకేముంది?' అన్నాడు.

'ఇంకేముంది', చిలిపిగా రెట్టించింది హంస.

'ఉద్యోగమంటే పదిమందిలో తిరిగి రావడం, వారితో మెలగడం, ఉహూ,—నాకెందుకో ఆడపిల్లలు ఉద్యోగానికి వెళ్ళడం అంటే ఇష్టం ఉండదు' అన్నాడు శ్రీధర్ మొండిగా.

'ఏయ్, శ్రీ, నీవింత మంది ఆడపిల్లలని తెచ్చి. పరిచయం చేసావే. మేమేదన్నా అన్నామా. ఆడపిల్లలు ఉద్యోగం చేసినంత మాత్రాన, మగవారితో మెలగినంత మాత్రాన ఏమౌతుంది? చెడిపోతారా?' హేళనగా ప్రశ్నించింది హంస.

'శ్రీధర్... హంస సరిగ్గానే మాట్లాడింది నీవు మాతో ఇంత చనువుగా తిరుగుతున్నావే, మా అన్నయ్యలు, తండ్రులు దీనికేమి అభ్యంతరం చెప్పడం లేదుగా' అంది పద్మ.

'అందరు నాలా ఉంటారనా మీ ఉద్దేశ్యం?' తీవ్రంగా అడిగాడు శ్రీధర్.

'ప్రతి మగవాడు అలానే అంటాడు. నా

అంత మంచివాడు లేడని' దురుసుగా వచ్చింది హంస సమాధానం.

హాస్యం కాస్త సీరియస్‌గా మారే సరికి లత కలుగచేసుకొని 'టీ కావాలి' అని హంసను లోపలికి పంపింది.

మరికొద్ది సేపటికి మేము వచ్చేసాం.

ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే మధురానికి వివాహం జరిగింది. హంసలో మొదటిసారి చూసిన ఉత్సాహం కన్పించలేదు.

ఒంటరిగా నిలబడిన నా దగ్గరగా వచ్చిన హంస, 'భాషాంతర వివాహాలపై మీ అభిప్రాయ మేమిటండి? అంది.

'సదభిప్రాయమే. ఏం ఎందుకలా అడిగారు?' అన్నాను వెంటనే.

'మా శ్రీధర్ జాతకాలు సరిచూసి, చేసిన వివాహాల కాలిగోటికి సరిపోదు భాషాంతర వివాహం అన్నాడు. మరి మీరు వాడి మిత్రులు గదా. మీరేమంటారో తెల్సుకుందామని' అని నవ్వి వెళ్ళిపోయింది హంస.

ఈ సంఘటన జరిగిన వారం రోజుల తర్వాత శ్రీధర్ లైబ్రరీలో కన్పించాడు. 'మధురం, హంస ఎలా ఉన్నారు?' అన్నాను.

'మధురం అత్తవారింటికి వెళ్ళింది. హంస లేచిపోయింది.' కఠినంగా ధ్వనించింది అతని గొంతు. సంభాషణ పొడిగించడానికి ధైర్యం చాలక, ఇంటికి వచ్చేసాను.

జరిగిన విషయ మేమిటో బోధపడక, మేము తికమక పడ్డాము. హఠాత్తుగా మొన్న సాయంత్రమే హంస కన్పడింది. ఆమె ప్రక్కన అందంగా, హుందాగా ఉన్న యువకుడున్నాడు. వారిద్దరిని చూసి, నేను, పద్మ ఆగిపోయాము. హంసే ముందుగా పలకరించింది. ప్రక్కనున్న వ్యక్తిని తన భర్త 'చంద్రదీప్'గా పరిచయం చేసింది.

కుతూహలాన్ని చంపుకోలేని నేను, 'హంసా, మీరు మీ వాళ్ళని వ్యతిరేకించి పెళ్ళి చేసుకొన్నారనుకొంటాను' అన్నాను.

'అవునండి. అభిరుచులు కలసి చేసుకొన్న వివాహం కంటే. చేతి రేఖలు కలిసిన వివాహం మంచిది అంటాడు మా శ్రీధర్. మళయాళీలు అంటే అసలు గిట్టదు. వాళ్ళందరు మంత్రగాళ్ళు అని మా శ్రీ ఉద్దేశ్యం. మాకీ మాత్రం చదువులు చెప్పించాడు. అందుకే సంతోషించాలి. ఉద్యోగం చేస్తానన్నందుకు మధురంని నానామాటలు అన్నాడు.

"మధురం పెళ్ళి ఆర్భాటంగా చేసి. పదిహేను వేలు అప్పుచేసాడు. నా పెళ్ళికి మరో పదిహేను వేలు అప్పుచేసి తనకి ముప్పై వేలు కట్నంగా తెచ్చుకొందా మనుకొన్నాడు. పాపం! నా పెళ్ళి ఖర్చు తప్పిందన్న దిగులుతో కన్పించిన వాళ్ళందరికి హంస లేచిపోయింది అని చెప్తున్నాడట!

"అన్నట్లు చెప్పడం మరిచిపోయాను. నే నిప్పుడు అసిస్టెంట్ న్యూట్రిషన్ టెక్నాలజిస్టుగా పనిచేస్తున్నాను. చంద్ర స్టెనోగ్రాఫర్" నవ్వుతూ తన దీర్ఘ సంభాషణని ఆపింది హంస.

'మరి మధురం ఏమన్నారు ఈ సంగతి తెల్సి' అంది పద్మ. 'శ్రీధర్‌ని ఎదిరించగలిగినందుకు, నా కిష్టమైన వ్యక్తిని వివాహమాడినందుకు అభినందనలు తెలియజేసింది.' గర్వంగా నవ్వింది హంస.

కదిలిపోతున్న ఆ జంటని చూస్తూ, నిలబడిపోయాం మే మిద్దరం. 'యధార్థాన్ని వక్రీకరించడమంటే ఏమిటి?' అన్న తమ్ముడి ప్రశ్న గుర్తుకు వచ్చింది.

తమకు నచ్చని పని ఎవరైనా చేస్తే, సహించలేని శ్రీధర్‌లాంటి వ్యక్తులు. ఆ యధార్థానికి వింత రంగులు పులిమి వక్రీకరిస్తుంటారు.

అందుకే తన కిష్టమైన పద్ధతిని జీవితాన్ని మలుచుకొన్న హంస శ్రీధర్ దృష్టిలో 'లేచిపోయింది!'